# మార్కులకు ఆధారం 'భూగోళం...'

డీఎస్‌సీ నుంచి సివిల్ సర్వీసెస్ పరీక్షల వరకు... అన్ని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలలో భూగోళ శాస్త్రం నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు వస్తాయి. ఏపీపీఎస్‌సీ, యుపీఎస్‌సీ నిర్వహించే వివిధ పరీక్షల జనరల్ స్టడీస్ ప్రశ్నాపత్రంలో ఈ విభాగం నుంచి ప్రతీసారి 25-30 ప్రశ్నలు వస్తుంటాయి.

## సబ్జెక్టుపై పట్టుకు:

- గత పరీక్షల ప్రశ్న పత్రాలను గమనించాలి.
- ప్రామాణిక పుస్తకాలను చదవాలి.
- ప్రిపరేషన్‌కు నిర్దిష్ట సమయం కేటాయించాలి.
- అట్లాస్‌ను కచ్చితంగా పరిశీలించాలి.

జనరల్ స్టడీస్ పేపర్‌లో మంచి స్కోరింగ్ సాధించాలంటే.. భూగోళశాస్త్రంపై దృష్టిసారించడం తప్పని సరి..! ఇందులో ప్రపంచ, భారతదేశ, ఆంధ్రప్రదేశ్ భౌగోళికాంశాలకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. భౌతిక, మానవీయ భౌగోళికాంశాలు రెండింటికీ ప్రాధాన్యం ఇచ్చి చదవాలి. భూస్వరూపాలు, నదులు, నేలలు, శీతోష్ణస్థితి, సహజ సంపద, పర్యావరణాంశాలు, జనాభా, వ్యవసాయం, ఖనిజాలు, పరిశ్రమలు, రవాణా.. తదితర అంశాలపై ప్రశ్నలు వస్తాయి.

## పరీక్ష స్థాయినిబట్టి ప్రశ్నలు :

విద్యార్థులు పరీక్ష స్థాయిని బట్టి ప్రిపరేషన్ కొనసాగించాలి. ఒకే అంశానికి సంబంధించి గ్రూప్-2, గ్రూప్-1, సివిల్ సర్వీసు పరీక్షల్లో అడిగే ప్రశ్నల స్థాయిలో తేడా ఉంటుంది. ఉదాహరణకు భారతదేశంలో నదులు అనే అంశాన్ని తీసుకుంటే - కావేరి నది జన్మస్థానమేది? అని గ్రూప్-2లో అడగొచ్చు. అదే గ్రూప్-1లో అయితే... కావేరి నదిని ఎందుకు జీవనదిగా పరిగణిస్తారు? అని అడిగే అవకాశముంది. సివిల్ సర్వీస్‌లో ప్రశ్నల రీతి మరింత విశ్లేషణాత్మకంగా ఉంటుంది. దక్షిణ భారతదేశంలో కింది నాలుగు నదులను ఉత్తర దక్షిణాలుగా అమర్చండి? అని కావేరి, పెన్నా, పంబన్, వేగై నదులను ఇవ్వవచ్చు. కాబట్టి ఏపీపీఎస్‌సీ, యుపీఎస్‌సీ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రశ్నల తీరును జాగ్రత్తగా గమనించాలి.

## ప్రశ్నలు అడిగే అంశాలు:

ఇటీవల ఏపీపీఎస్‌సీ, యుపీఎస్‌సీ ప్రశ్న పత్రాలను జాగ్రత్తగా గమనిస్తే.. భూగోళ శాస్త్ర విభాగం నుంచి

ప్రశ్నలు ప్రధానంగా కింది అంశాలకు సంబంధించి ఉంటున్నాయి..

- సౌర కుటుంబ నిర్మాణం-ఆవిర్భావం.
- భూమి అంతర్నిర్మాణం, శిలలు.
- భూభ్రమణం, భూపరిభ్రమణం వల్ల సంభవించే - విపత్తులు, సమయం, అంతర్జాతీయ దినరేఖ మొదలైన విషయాలు.
- పర్వతాలు, పీఠభూముల వంటి భూస్వరూపాలు, దీవులు.
- వాతావరణ పొర నిర్మాణం, సంఘటనలు, పవనాలు, ప్రధాన శీతోష్ణస్థితి మండలాలు.
- సముద్ర భూతల నైసర్గిక స్వరూపం, లవణీయత, సముద్ర ప్రవాహాలు, అఖాతాలు, సింధు శాఖలు, జలసంధులు.
- నదీ వ్యవస్థలు... వాటిపై నిర్మించిన ప్రధాన ఆనకట్టలు, జలపాతాలు.
- ముఖ్యమైన ఖనిజాలు, వాటి గనుల కేంద్రాలు, ప్రధాన పారిశ్రామిక పట్టణాలు.
- జనాభాపరంగా ప్రపంచంలో దేశాలు, మన దేశంలో రాష్ట్రాలు, మన రాష్ట్రాల్లో జిల్లాలకు సంబంధించిన సమాచారం - జనాభా, జనాభా పెరుగుదల రేట్లు, సెక్స్ నిష్పత్తులు మొదలైనవి.
- ఖండాంతర రైళ్లు, రోడ్డు మార్గాలు, జాతీయ రహదారులు జాతీయ జల మార్గాలు, రైల్వే జోనల్ కేంద్రాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, ప్రధాన పోర్టులు.

పై అంశాలకు సంబంధించి సమకాలీనంగా చర్చనీయాంశంగా ఉన్న సమాచారాన్ని జాగ్రత్తగా మదింపు చేయాలి. ఉదాహరణకు సౌరకుటుంబానికి సంబంధించి ప్రిపేర్ అయ్యే సమయంలో..

- ఇటీవల 'గ్రహాన్ని' ప్రేగ్ సమావేశంలో ఏ రకంగా నిర్వచించారు?
- ప్లూటోను గ్రహాల జాబితా నుంచి ఎందుకు తొలగించారు?
- మరుగుజ్జు గ్రహాలు ఏవి?

వంటి సమాచారంపై దృష్టి కేంద్రీకరించాలి. ఇటీవల వార్తలలో ఉన్న భూస్వరూపాలు, ప్రదేశాలను నిశితంగా పరిశీలించాలి. వీటి ఉనికిని అట్లాస్‌లో గమనిస్తూ ఉండాలి.

ఉదాహరణకు..

- షట్ అల్ అరబ్ జలమార్గం ఎక్కడ ఉంది? ఏ దేశాల సరిహద్దుగా ఉంది?
- అణు రియాక్టర్లు ఎక్కడ ఉన్నాయి?

మనోరమ ఇయర్ బుక్‌లో ఇచ్చిన ప్రాథమిక సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ పుస్తకంలో ముఖ్యంగా అధ్యయనం చేయాల్సినవి...

- విస్తీర్ణతా పరంగా ఖండాలు, దీవులు, దేశాలు
- ఎత్తుల పరంగా పర్వత శిఖరాలు, అగ్ని పర్వతాలు
- పొడవైన, పెద్ద నదులు
- ఎత్తైన జలపాతాలు

- అత్యధిక జనాభా, జనసాంద్రత ఉన్న దేశాలు
- ముఖ్యమైన నదుల ఒడ్డున ఉన్న ప్రధాన నగరాలు
- అత్యధిక జనాభా ఉన్న నగరాలు
- ప్రధాన దేశాల కరెన్సీ పేర్లు, పార్లమెంట్ల పేర్లు మొదలైనవి.

మనోరమ ఇయర్ బుక్‌లో పేర్కొన్న పై అంశాలు జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించినవి. ఇలాంటి ప్రశ్నలు గ్రూప్-2 స్థాయి వరకు మాత్రమే వస్తాయి. గ్రూప్-1, సివిల్ సర్వీస్ వంటి ఉన్నత స్థాయి పరీక్షల్లో ఈ రకమైన జనరల్ నాలెడ్జ్ ఆధారిత ప్రశ్నలు దాదాపు అడగరు. ఉన్నతస్థాయి పరీక్షలలో ప్రశ్నలు సబ్జెక్టు మీద, సమకాలీన విషయాల మీద మాత్రమే అడుగుతుంటారు.

### ప్రాథమిక అవగాహన కోసం:

జాగ్రఫీ సబ్జెక్టుకు సంబంధించిన ప్రాథమిక అంశాల మీద అవగాహన ఏర్పడడానికి ఎన్‌సీఈఆర్‌టీ, 9,10,12 తరగతుల భూగోళ శాస్త్రం పాఠ్య పుస్తకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఇండియా ఇయర్ బుక్, ఎకానమిక్ సర్వే పుస్తకాలలో భారతదేశంలో ఇటీవల నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు, సాగునీటి విస్తీర్ణం, ప్రధాన రేవు పట్టణాల్లో కార్గో వివరాలు లభిస్తాయి. వీటిని నోట్స్‌గా రాసుకోవాలి.

### అట్లాస్ తప్పనిసరి:

రాయల్-చాంద్-ఓరియంట్ లాంగ్‌మన్ పబ్లిషర్ల అట్లాస్.. ఏదో ఒకటి క్రమం తప్పకుండా చూస్తుండాలి. ముఖ్యంగా వార్తలలో ఉన్న ప్రదేశాలను అట్లాస్‌లో గుర్తిస్తూ ఉండాలి. దీనిని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి. ఏదో ఒక గైడ్‌ను చదివి ప్రిపరేషన్ ముగిసిందనుకుంటే పొరపాటు. గైడ్లు, మెటీరియల్స్ సంప్రదాయ ప్రిపరేషన్‌కు అనుబంధంగా మాత్రమే ఉపకరిస్తాయి. క్వశ్చన్ బ్యాంక్‌లపై విద్యార్థులు ఆధారపడ కూడదు. వీటి ద్వారా సబ్జెక్టు నేర్చుకోవటం కుదరదు. ఇవి కేవలం అభ్యాసానికి, సన్నద్ధత పరీక్షించుకోవడానికి మాత్రమే ఉపయోగించు కోవాలి.

### కనీసం రెండు గంటలు :

తెలుగు అకాడెమీ రూపొందించిన ఆంధ్రప్రదేశ్, భారతదేశ ప్రాంతీయ భూగోళశాస్త్ర పాఠ్యగ్రంథాలు కొంతవరకు ఉపకరిస్తాయి. కానీ కేవలం తెలుగు మీడియం పాఠ్యపుస్తకాలపై ఆధారపడితే సరిపోదు. జనరల్ స్టడీస్ ప్రిపరేషన్‌లో భాగంగా భూగోళశాస్త్ర విభాగం ప్రిపరేషన్ కోసం రోజూ కనీసం రెండు గంటల సమయాన్ని కేటాయించాలి.

మనరాష్ట్ర సిలబస్‌లో పాఠశాల స్థాయిలో భూగోళశాస్త్ర అధ్యయన స్థాయి చాలా తక్కువ. అందువల్ల

లోతుగా వెళ్లేకొద్దీ విద్యార్థులకు ఈ అంశం కొత్తగా కనిపిస్తుంది. ప్రిపరేషన్‌కు ఎక్కువ సమయాన్ని కేటాయించడం ద్వారా మాత్రమే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రణాళిక ప్రకారం జనరల్ స్టడీస్ ను అధ్యయనం చేస్తే విజయం తప్పక చేకూరుతుంది.

## భూగోళం ప్రశ్నల తీరు

మానవీయ భూగోళశాస్త్రంలో ప్రశ్నలు ప్రధానంగా ఖనిజాలు, పరిశ్రమలు, వ్యవసాయం, రవాణా, జనాభా, జనావాసాలు, సంస్కృతి మొదలైన అంశాల నుంచి అడిగే అవకాశముంది. ఈ ప్రశ్నలు ప్రపంచం, భారతదేశం, ఆంధ్రప్రదేశ్ నేపథ్యం నుంచి ఉండవచ్చు. ఖనిజాలకు సంబంధించి ప్రశ్నలు గనుల కేంద్రాలు, ముడిఖనిజాల రకాలు, ఖనిజాల ఉపయోగాలకు సంబంధించి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. ఉదాహరణకు కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం...

**భారతదేశంలో కింది సూచించిన ఏ ఖనిజ వనరులు సమృద్ధిగా ఉన్నాయి?**

ఎ) ఫెర్రస్ లోహాలు బి) నాన్‌ఫెర్రస్ లోహాలు సి) అలోహాలు డి) రిఫ్రాక్టరీ ఖనిజాలు

**సమాధానం : ఎ**

ఇనుము, మాంగనీస్, బాక్సైట్, క్రోమైట్ ఫెర్రస్ లోహాల తరగతికి చెందిన ఖనిజాలు. వీటి నిలువలు విస్తారంగా ఉన్నాయి. ఇవి నాణ్యమైనవి కూడా. వీటిని మనం ఎగుమతి చేస్తున్నాం. హెమటైట్ రకానికి చెందిన మేలిరకపు ఇనుప ఖనిజాన్ని మనం జపాన్, చైనా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. రాగి, సీసం, జింక్ వంటి నాన్‌ఫెర్రస్ లోహ ధాతువుల నిల్వలు భారతదేశంలో చాలా తక్కువ. ఇవి నాసిరకమైనవి కూడా. మనం ఈ ఖనిజాలకు దిగుమతులపై ఆధారపడుతున్నాం. యూఎస్ఏ నుంచి శుద్ధి చేసిన రాగిని దిగుమతి చేసుకుంటున్నాం.

**జతపరచండి?**

ఎ) రామగిరి 1) యురేనియం

బి) జాడుగుడా 2) ఇనుము

సి) బైలడిల్లా 3) బంగారం

డి) ఖేత్రి 4) రాగి

**సమాధానం : సి**

| | ఎ | బి | సి | డి |
|---|---|---|---|---|
| ఎ) | 1 | 3 | 4 | 2 |
| బి) | 1 | 3 | 2 | 4 |
| సి) | 3 | 1 | 2 | 4 |
| డి) | 3 | 1 | 4 | 2 |

ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం జిల్లాలో రామగిరిలో బంగారం ఖనిజ నిల్వలున్నాయి. కానీ వీటిని ప్రస్తుతం వెలికి తీయటంలేదు. భారతదేశంలో వాణిజ్య అవసరాల కోసం బంగారం వెలికితీస్తోంది కేవలం కర్ణాటకలో హట్టి నుంచి మాత్రమే. కోలార్ గనులను కేవలం పరిశోధనావసరాలకు మాత్రమే

వినియోగిస్తున్నారు. జార్ఖండ్‌లోని జాదుగుడా ప్రధాన యురేనియం ఉత్పత్తి కేంద్రం. మేఘాలయలోని ఖాసి కొండలలో 'డొమియోస్టేట్' వద్ద కూడా యురేనియం తవ్వకాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నల్గొండ, కర్నూలు జిల్లాల్లో కూడా యురేనియం నిల్వలున్నాయి. ఇక్కడ యురేనియం గనులను ప్రారంభించటానికి UCIL ప్రయత్నం చేస్తోంది.

**ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లలో తూర్పు కనుమలలో ఏ ఖనిజ నిల్వలు విస్తారంగా ఉన్నాయి?**

ఎ) హెమటైట్ బి) బాక్సైట్ సి) క్యాప్రైట్ డి) సున్నపురాయి

**సమాధానం : బి**

భారతదేశంలో మొత్తం బాక్సైటు నిల్వలలో సుమారు 80 శాతం ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లలో తూర్పు కనుమలలో కేంద్రీకృతమై ఉన్నాయి. ఒరిస్సా బాక్సైటు నిల్వలను వెలికి తీస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ఎజెన్సీ ప్రాంతాలోని నిల్వలను పర్యావరణ కారణాల రీత్యా ఇంకా వెలికి తీయటం లేదు. ఇటీవలే జిందాల్ కంపెనీకి ఈ ప్రాంతంలో బాక్సైట్ గనులను ప్రారంభించటానికి ప్రభుత్వం అనుమతించింది.

**కింద సూచించిన ప్రదేశాలలో బొగ్గుగనుల కేంద్రాలను గుర్తించండి?**

1) ఇల్లందు 2) భూపాలపల్లి 3) సత్తుపల్లి 4) మందమర్రి

ఎ) 1,2 బి) 1,2,3 సి) 1,2,4 డి) పైవన్నీ

**సమాధానం : డి**

ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి లోయలోని గోండ్వానా యుగానికి చెందిన అవక్షేపశిలల్లో బొగ్గు నిక్షేపాలున్నాయి. దీనిని సింగరేణి బొగ్గు క్షేత్రంగా పిలుస్తారు. ఈ బొగ్గు క్షేత్రం ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో విస్తరించి ఉంది. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, గోదావరిఖని, మందమర్రి ప్రధాన గని కేంద్రాలు. వరంగల్ జిల్లాలో భూపాలపల్లి, ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి వద్ద ఇటీవలే బొగ్గు గనులను ప్రారంభించారు. ఖమ్మం జిల్లా చర్ల ప్రాంతంలో నిల్వల తవ్వకాలు ఇంకా ప్రారంభం కాలేదు. పరిశ్రమల అంశంలో ప్రశ్నలు, పరిశ్రమల ఉనికి, వాటి ముడిఖనిజాల లభ్యత, సమస్యలు మొదలైన విషయాల మీద ఉండవచ్చు. ఇందులో సమకాలీన అంశాల మీద దృష్టి కేంద్రీకరించాలి.

**భారత్‌లో ఇనుము-ఉక్కు కర్మాగారాల ఉనికి ప్రధానంగా ఏ ముడి వస్తువు లభ్యతపై ఆధారపడి ఉంది?**

ఎ) ముడి ఇనుము బి) బొగ్గు సి) సున్నపురాయి డి) మాంగనీసు

**సమాధానం : ఎ**

భారతదేశంలోని సమీకృత ఉక్కు కర్మాగారాలన్నీ(ఒక్క విశాఖపట్నం మినహా) ఇనుప ఖనిజం లభించే ప్రాంతాల్లోనే స్థాపించారు. విశాఖపట్నం, భద్రావతి, భిలాయ్, రూర్కెలా కర్మాగారాలకు సమీపంలో బొగ్గు క్షేత్రాలు లేవు. ప్రైవేట్ రంగంలో రెండు సమీకృత కర్మాగారాలున్నాయి. అవి.. 1) జంషెడ్‌పూర్ 2) తొరంగల్(కర్ణాటక). దక్షిణా కొరియాకు చెందిన POSCO (పోహంగ్ స్టీల్ కంపెనీ), టాటాస్టీల్స్, మిట్టల్

స్టీల్స్ ప్రైవేట్ రంగంలో కొత్తగా సమీకృత ఉక్కు కర్మాగారాలను ఒరిస్సాలో ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే స్థానిక ప్రజల నుంచి వీటి ఏర్పాటుకు వ్యతిరేకత ఎదురవుతోంది.

**ఆంధ్రప్రదేశ్‌లో కింది ప్రదేశంలో కాగితం కర్మాగారం లేదు?**

ఎ) సారపాక బి) రాజమండ్రి సి) తణుకు డి) సిర్పూర్

**సమాధానం : సి**

భద్రాచలం సమీపంలో సారపాక, రాజమండ్రి, ఆదిలాబాద్ జిల్లాలో సిర్పూర్(కాగజ్‌నగర్)లలో పెద్ద కాగితం కర్మాగారాలున్నాయి. తణుకులో చక్కెర కర్మాగారం (ఆంధ్రాషుగర్స్) ఉంది.

**జతపరచండి?**

ఎ) ఏటికొప్పాక 1) కరీంనగర్

బి) పెంబర్తి 2) కొయ్యబొమ్మలు

సి) ఫిలిగ్రీ 3) గ్రానైట్

డి) చీమకుర్తి 4) ఇత్తడి సామాగ్రి

| | ఎ | బి | సి | డి |
|---|---|---|---|---|
| ఎ) | 4 | 2 | 3 | 1 |
| బి) | 4 | 2 | 1 | 3 |
| సి) | 2 | 4 | 3 | 1 |
| డి) | 2 | 4 | 1 | 3 |

**సమాధానం : డి**

పై ప్రశ్నలో చీమకుర్తి(ఒంగోలు జిల్లా) నాణ్యమైన గెలాక్సీ నల్ల గ్రానైట్ నిల్వలకు ప్రసిద్ధి. మిగిలినవి హస్తకళల కేంద్రాలు. ఇవేకాక మార్కాపురంలో పలకల పరిశ్రమ, కొండపల్లి, నిర్మల్‌లలో బొమ్మల తయారీ, నర్సాపురంలో లేసుల తయారీ జరుగుతోంది. ఫిలిగ్రీ అంటే వెండి నగిషీలు.